క్లుప్తంగా

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

కౌతాళం: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ప్రజలు సైబర్ నేరగాళ్లబారిన పడుతూ మోసాలకు గురవుతున్నారన్నారు. ఎస్‌ఎంఎస్‌ల ద్వారా లింక్‌లను పంపుతూ మోసాలు చేస్తున్నారని, బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషకాల గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్

కౌతాళం: పిల్లలకు సమతుల్యమైన పోషకాల ఆహారాన్ని అందించి వారి ఎదుగుదలకు పాటుపడాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వీర గోవిందమ్మ అన్నారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం-3లో బుధవారం చిన్నారులు, గర్భిణులకు, బాలింతలకు పోషకాల విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలను తీసుకుంటే రక్తహీనత తగ్గుతుందన్నారు. అనంతరం పోషక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ఖాసీంబీ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ఆదోని రూరల్: మున్సిపల్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్ట్ రద్దు చేసి వారందరినీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు ఎస్.మునెప్ప, అజయ్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ మైదానంలో వారు కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇస్తున్న కళాశాలల అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: డిగ్రీ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సత్వరం విడుదల చేయాలని స్థానిక ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అధ్యాపక, అధ్యాపేకతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు రాక , ఉద్యోగ భద్రత లేక ఆర్థిక ఇబ్బందులో కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, బి-ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్, బీ-ఫార్మసీ కాలేజీలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం చేయటంతో క్షతగాత్రులకు అత్యవసర పరిస్థితిల్లో రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు.



కామవరంలో కొలువైన అమ్మవారు



ఉప్పరహాల్‌లో అన్నపూర్ణేశ్వరి దేవిగా..



గురజాలలో గాయత్రి దేవి అలంకరణలో పార్వతిదేవి



గుడేకల్‌లో అన్నపూర్ణదేవిగా శ్రీ చౌడేశ్వరి దేవి




కందుకూరులో అన్నపూర్ణా దేవిగా శాంభవి దేవి



మంత్రాలయంలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, నాయకులు

ఊరూరా దేవీ వైభవం!




ఎమ్మిగనూరులో అన్నపూర్ణ దేవిగా వాసవీమాత, (ఇన్‌సెట్లో) వీవర్స్ కాలనీలో పూజలందుకుంటున్న దుర్గమ్మ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరూరా వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేపట్టారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఆలయాల్లో అమ్మవార్లను అన్నపూర్ణేశ్వరిగా, గాయత్రి దేవి, గౌరీమాత తదితర రూపాల్లో అలంకరించారు. ఆయా ఆలయాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ రాజ్మా, సోయాబీన్స్ అలంకరణలో, నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీమాత భవానీ అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గురజాల రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి వర్ధినీ దేవి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. టి. సోమలగూడూరులో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలయం రాఘవేంద్ర నగర్‌లో కొలువుతీరిన దుర్గామాతకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, నాయకులు గోరుకల్లు కృష్ణ స్వామి, కురువ మల్లికార్జున, శివకుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గోనెగండ్లలోని మారెమ్మ దేవాలయంలో బుధవారం వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో నవగ్రహ జపములు, నవగ్రహ హోమాలు, కుంకుమ అర్చన, ఆకుపూజ, అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

– ఎమ్మిగనూరురూరల్/టౌన్/కౌతాళం/నందవరం/మంత్రాలయం/కోసిగి/పెద్దకడబూరు/ఆదోని అర్బన్ /గోనెగండ్ల



ఆదోనిలో రాజ్మా, సోయాబీన్స్ అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



ఆదోని మున్సిపల్ మైదానంలో కొలువుదీరిన దుర్గాదేవి

విశ్వశాంతి మహాయాగ స్థలం పరిశీలన



కృష్ణజ్యోతి స్వరూపానందతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: కార్తీక మాసంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ కాలచక్ర 87వ విశ్వశాంతి మహాయాగం కోసం పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో స్థలాన్ని బుధవారం యాగ నిర్వాహకులు శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామితో కలిసి మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మహాయాగం గురించి స్వామీజీని అడిగి తెలుసుకున్నారు. సర్వమానవ కల్యాణం, ప్రజా శ్రేయస్సు, పీడిత ప్రజల క్షేమం కోసం ఈ యాగం నిర్వహిస్తున్నామని స్వామిజీ మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. సకల సౌభాగ్యాలతో విశ్వమానవులు, ఆయారాగ్యాలతో సంపదలతో ఆనందమయ జీవితం గడపాలన్న సంకల్పంతో యాగం చేయనున్నట్లు తెలిపారు. దీంతో ఈ యాగానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా అంతకుముందు ఆదోని సబ్ కలెక్టర్, వైడబ్ల్యూసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మౌర్యభరద్వాజ్‌కు వైడబ్ల్యూసీఎస్ మైదానంలో యాగ నిర్వహణకు వారు అనుమతి కోరారు. కార్యక్రమంలో యాగం నిర్వాహకులు సత్యనారాయణరెడ్డి, మాచాని వెంకటేష్, మాచాని నాగరాజు, లక్ష్మీరెడ్డి, కేఆర్ నటరాజ్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేపీ ఈరన్న, శేషయ్యశెట్టి, షఫీవుల్లా, హరిప్రసాద్ శెట్టి, కామలే గణేష్, సోమేష్, మరియాని రాజు, రమేష్‌శెట్టి, నాగకుమార్‌శెట్టి, జనార్దన్ శెట్టి, మాణిక్యరెడ్డి, ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశానికి తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అవతారం

కౌతాళం: కర్నూలులో ఈనెల 27వ తేదీన నిర్వహించే వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశానికి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అవతారం కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ముూరు కనకరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు జయపాల్, కోసిగి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అంజి, నాయకులు దేవపుత్ర, కిష్టప్ప, రంగప్ప, హాల్వి ఉసేని, రొడూరు ముఖేష్, యేసయ్య, నాగరాజు, బసవ తదితరులు పాల్గొన్నారు.

కనకవీడు పేటలో సమస్యలు పరిష్కరించండి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నందవరం: కనకవీడు పేట గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలోని ప్రధాన రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులు వీరన్న, వెంకటేష్, వెంకటేశులు, మద్దన్న, మహిళలు నాట్లు వేశారు. అలాగే బీసీ కాలనీలో ఇళ్ల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, తొలగించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో బీసీ కాలనీల్లో సీసీ రోడ్లు లేవని, ప్రధాన రహదారిలో డ్రైయినేజీలు లేక మురుగు నీరు రోడ్డుపై పారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో గ్రామస్తులు మేకల వెంకటేష్, శివప్ప, ఈరన్న, తిమ్మప్ప, నరసింహులు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఈకేవైసీ వేగవంతం చేయండి

నందవరం : ఉపాధి కూలీల ఈకేవైసీని వేగవంతంగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, టీఏలకు ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఉపాధి కూలీలకు చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ కార్డులో ఉన్న ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ తప్పని సరి చేయించుకోవాలన్నారు. మండలంలో 20,427 జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉండగా, ఇప్పటికి వరకు 3,350 ఈకేవైసీ పూర్తయ్యాయని ఈ నెల 30వ తేదీ లోపు మొత్తం పూర్తి చేయాలన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఎమ్మిగనూరురూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా చేపట్టిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు తోట రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజుల ఈ నెల 17 కాగా ఆరోజు నుంచి పార్టీ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ నిర్భార్ భారత్ నియోజకవర్గ ఇన్‌చార్జి గురురాజ్ దేశాయ్, జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ వీజీఆర్ దయాసాగర్, సీనియర్ నాయకులు లలిత్‌జైన్, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బుధవారం జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య ఆధ్వర్యంలో ఆసంఘ కార్యాలయంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షుడుగా సంద్యపోగు హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా చిన్నమాదిగ, కార్యదర్శిగా చరణ్, కోశాధికారిగా ఎబనేజర్, కన్వీనర్‌గా దిలిప్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు బుజ్జిబాబు, అబ్రహం, గుంటెప్ప, కదిరికోట పద్మక్క, కందనాతి నాగరాజు, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు మద్దతివ్వండి

ఆదోని రూరల్: ఆదోని జిల్లా సాధనకు మద్దతు తెలపాలని చర్చిల సంఘం అధ్యక్షులు రెవరెండ్ ఆనంద్ రాజ్‌ను, సెక్రటరీ ఎజ్రా శ్రీధర్‌ను ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహ్మద్ కోరారు. బుధవారం పట్టణంలోని ఇందిరానగర్‌లోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదోని జిల్లా సాధన పోరాటానికి తప్పకుండా రాబోయే రోజుల్లో ఆదోనిలోని అన్ని చర్చిల పాస్టర్లు, బాధ్యులు, విశ్వాసులతో చర్చించి ఆదోని జిల్లా ఉద్యమానికి మద్దతుగా ముందుకు వస్తామన్నారు. వారి వెంట ఆదోని జిల్లా సమితి మండల కన్వీనర్ నరేంద్రయాదవ్, హఫీజ్, డీఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉదయ్‌కుమార్, ఆర్‌ఎస్‌పీఎస్‌ఎఫ్ నాయకులు బాలు ఉన్నారు.

గంజాయి సాగుచేస్తే చట్టరీత్యా నేరం

ఆదోని రూరల్: ఎవరైనా పొలాల్లో గంజాయి సాగు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి బీవీజీ సుధాకర్ హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల ఓ రైతు అక్రమంగా గంజాయి మొక్కలను సాగుచేయగా పోలీసుల సాయంతో పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. వర్షాలకు పత్తి పంటలో వర్షపునీరు నిలబడితే పూత, పిందె, కాయలు రాలిపోవడం జరుగుతుందన్నారు. పొలంలో నిలిచిన నీటిని తొలగించాలన్నారు. పత్తిలో కాయకుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు నివారించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అధినేత వైఎస్ జగన్‌తో..



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ నేత బుట్టా నీలకంఠ, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి తదితరులు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై జగనన్నతో వారు చర్చించారు.



ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చుదాం

కౌతాళం: ప్లాస్టిక్ రహిత గ్రామంగా కౌతాళాన్ని మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి ప్రకాశం కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. హోటళ్లు, కిరాణషాపులు, కూల్ డ్రింక్స్ షాపులు, వివిధ షాపుల యజమానులు ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలన్నారు. ప్రజలు డస్ట్ బిన్‌లు ఉపయోగించి, చెత్తసేకరణకు వచ్చే పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలన్నారు. రోడ్లపై చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

బంగారు కుటుంబాలను గుర్తించండి

పెద్దకడబూరు: మండలంలోని నిరుపేద (బంగారు కుటుంబాలను)లను ప్రణాళికా బద్ధంగా గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేయాలని మంత్రాలయం నియోజకవర్గం యువ నిపుణులు (పీ-4) డాక్టర్ రాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏఓ కౌశల్య ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు పీ-4పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరుపేదల గుర్తింపు, మార్గదర్శుల మ్యాపింగ్, సహాయ సహకారం ఎలా అందించాలి అనే విషయాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలికకు చేయూత

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన కాకె చిన్న ఆదెన్న కుమార్తె రూప హార్మోన్ల లోపంతో ఎదుగుదల లేని సమస్యతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కరె శకుంతలమ్మ కుమారుడు మహేష్ బాలిక రూపకు బుధవారం ఆర్థిక చేయూతనందించాడు. బాలికకు నెల రోజుకు సరిపడే మందులకు రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బాలిక ఆరోగ్యం కోసం ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ నాయకులు లింగమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సస్య రక్షణ చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ

గోనెగండ్ల: మిరప పంటలో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరప పంటలో వైరస్ తెగులు నివారణకు కారణమయ్యే రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరానికి 30 పసుపు, నీలి తెలుపు జిగురు అట్టలు పెట్టుకోవాలని సూచించారు. ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ పత్తిలో బ్యాక్టీరియా తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు, ప్లాంటో మైసిన్ 0.1 గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. గోనెగండ్ల ఏఓ హేమలత మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు పులి రాజు, అరుణ, గ్రామ వ్యవసాయ అధికారులు మల్లికార్జున, మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆర్డీటీ సంస్థ సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, ప్రజాసంఘాల నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, ముత్తు సుమాల, హనుమన్న, సింగనేటి నరసన్న, నాగరాజు కోరారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని దాదాపు 4వేల గ్రామాల్లోని పేద, బడుగు వర్గాల ప్రజలకు సేవలందించిన ఆర్డీటీని కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రైవేట్ టీచర్లకు దసరా సెలవులు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులతో పాటు ప్రైవేట్ టీచర్లకు కూడా దసరా సెలవులను ఇవ్వాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ హక్కుల వేదిక ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు ప్రైవేట్ పాఠశాలలలోని తరగతులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీటీహెచ్‌వీ రాష్ట్ర అధ్యక్షులు నరేష్ ఆచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించినా కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు బేఖాతర్ చేస్తున్నాయన్నారు. కొన్ని యాజమాన్యాలు వర్క్‌షాప్ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు పిలిపించి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి సెలవుల్లో కూడా పాఠశాలలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సోమశేఖర్, తిరుమలేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ తీసుకుని మోసం..

ఆదోని అర్బన్: హైదరాబాద్‌కు చెందిన మహేశ్వర్ సింగ్ ఇంటీరియల్ డిజైన్ చేస్తానని రూ. 3 లక్షలు అడ్వాన్సుగా తీసుకుని మోసం చేశాడని పట్టణంలోని రెడ్‌చిల్లీ బార్ అండ్ రెస్టారెంట్ యజమాని రితినొట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో ఇంటీరియల్ డిజైన్ చేస్తానని ఆరు నెలల క్రితం అడ్వాన్స్ తీసుకుని ఇప్పటి వరకు పనులు చేయలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

● మా ఊరి రోడ్డును బాగు చేయండి



ధణాపురం-హొళగుంద రోడ్డును అభివృద్ధి చేయాలని నాగనాథనహళ్లి గ్రామస్తులు, ఆటో డ్రైవర్లు బుధవారం రోడ్డుపై నిలిచిన నీటిలో నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రవి, ఆదెప్ప, వీరేష్, రంగడు, నాగేష్, శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ.. ధణాపురం-హొళగుంద రహదారి గుంతలమయంగా మారి అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా రాలేకపోతున్నాయన్నారు. శిథిలావస్థకు చేరిన రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ మేరకు అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందించారు.

– ఆదోని రూరల్

● శ్మశానానికి పట్టాల మీదుగా..





ఢణేకల్ గ్రామంలో శ్మశానికి వెళ్లే దారి లేకపోవడంతో గ్రామస్తులు మృతదేహాలను రైల్వే ట్రాక్ మీదుగా తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం గ్రామంలో ఓ మృతదేహానికి అంత్యక్రియలు చేపట్టేందుకు రైల్వే ట్రాక్ దాటుకుంటూ వెళ్లారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మానవతా దృక్పథంతో అయినా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

– ఆదోని రూరల్